ప్రజాశక్తి

మంగళవారం 7 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ధాన్యం కొనుగోలు నిలిపివేత!

- ఇచ్చిన స్వల్ప లక్ష్యం పూర్తి చేసిన అధికారులు
- రైతుల వద్ద భారీగా నిల్వలు
- ప్రభుత్వ ఉత్తర్వులు కోసం మిల్లర్ల ఎదురుచూపులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలును నిలిపివేసింది. చాలా తక్కువ స్థాయిలో లక్ష్యం నిర్ధారించి ఆ మేరకు కొనుగోలు పూర్తి చేసినట్టు చూపి తదుపరి లక్ష్యం ఇవ్వకుండా నిలిపివేశారని మిల్లర్లు తెలిపారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. రెండు జిల్లాల పరిధిలో రైతుల వద్ద మూడు లక్షల టన్నులకు పైగా ధాన్యం నిల్వలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో కేవలం ఐదు వేల టన్నులు మాత్రమే లక్ష్యంగా నిర్ధారించగా సోమవారం సాయంత్రం వరకు 5100 టన్నులు కొనుగోలు చేసి నిలిపివేశారు. తదుపరి లక్ష్యం ఇవ్వకపోవడం వల్ల తాము కొనుగోలు చేయడం లేదని మిల్లర్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో 85 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా దాదాపు 2.26 లక్షల టన్నుల ధాన్యం వచ్చినట్టు అంచనా. పల్నాడు ప్రాంతంలో స్పాట్ క్యాష్‌తో తెలంగాణ వ్యాపారులు వచ్చి 75 కిలోల బస్తా రూ.1500కు కొనుగోలు చేస్తున్నారు.

గుంటూరు జిల్లాలో గతనెల రోజుల కాలంలో రైతుల నుంచి మిల్లర్ల ద్వారా ప్రభుత్వం 20 వేల టన్నుల కొనుగోలుకు రెండు దఫాలుగా లక్ష్యం నిర్దేశించింది. అయితే ఇప్పటి వరకు 22 వేల టన్నులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి లక్ష్యం ఇవ్వకపోవడంతో సోమవారం సాయంత్రం నుంచి రైతుల నుంచి కొనుగోలు నిలిపివేసినట్టు మిల్లర్లకు అధికారులు సమాచారం అందించారు. జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగైది. ఎకరాకు 35 బస్తాల సగటు దిగుబడి వచ్చింది. బస్తాకు 76 కిలోల చొప్పున 2.66 టన్నుల ధాన్యం వస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 3.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి వచ్చినా ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 20 వేల టన్నులే లక్ష్యంగా నిర్ధారించారు. అయితే ఇప్పటి వరకు దాదాపు లక్షన్నర టన్నుల ధాన్యం దిగుబడి రైతుల వద్దకు చేరగా కేవలం 12 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. మరో 2.35 లక్షల టన్నుల ధాన్యం వరకు రైతులు నూర్పిడి చేయకుండా కుప్పలు వేసి ఉంచారని అంచనా.

ఈ ఏడాది కనీస మద్దతు ధర 75 కిలోల బస్తాకు

2లో

ధాన్యం కొనుగోలుపై గుంటూరు జిల్లా జెసితో చర్చిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్

జెసితో ఎమ్మెల్యే నరేంద్ర సమావేశం

ధాన్యం కొనుగోలుపై గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవ తేజతో పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ సోమవారం సాయంత్రం సమావేశ మయ్యారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరాన్ని చెప్పారు. గుంటూరు జిల్లాకు 20 వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతిచ్చారని, తాము 22 వేల టన్నుల వరకు కొనుగోలు చేశామని ఎమ్మెల్యేకు జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ వివరించారు. రైతుల వద్ద లక్షల టన్నుల ధాన్యం ఉందని, వెంటనే కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరగా ప్రభుత్వ ఉత్తర్వులు కోసం ఎదురు చూస్తున్నామని జెసి చెప్పారు.

బ్యాంకు ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

కౌల్దార్లకు రుణాల కోసం ధర్నా

చిలువూరు యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతి - మంజూరుకు హామీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

పంటలు సాగు చేస్తున్న ప్రతికౌలు రైతుకూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిబంధనల ప్రకారం రూ.రెండు లక్షల వరకు షరతులు, తనఖా లేకుండా పంట రుణాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని చిలువూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ వద్ద కౌలు రైతుల ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టడంతో కౌలు రైతులు కీలకపాత్ర పోషిస్తున్నా వారికి రుణాల విషయంలో మాత్రం ప్రభుత్వం, బ్యాంకులు సవాలక్ష నిబంధనలు పెట్టి ఇబ్బందులు గురి చేస్తున్నాయని విమర్శించారు. దుకాణదార్లు, వాహనదార్లు, ఇతరులకు వడ్డీలేని అప్పులిస్తున్నా కౌల్దార్లకు రుణాలివ్వడంలో చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. బడా పెట్టుబడిదార్లకు రూ.లక్షల కోట్లు అప్పులివ్వడంతోపాటు, వాటిని మాఫీ చేయడంలో ఉన్న శ్రద్ధ వ్యవసాయదార్లపై ఎందుకు లేదన్నారు. ఆర్‌బిఐ

2లో

మూడోరోజు 159 మంది అర్హత

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

2లో

తురకా కిషోర్‌కు రిమాండ్

పటిష్ట బందోబస్తు నడుమ సోదరునితో కలిపి గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

ప్రజాశక్తి - మాచర్ల

వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌ను సోమవారం మాచర్ల అడిషనల్ జూనియర్ సివిల్ కోర్డులో హాజరు పరచగా ఇన్‌చార్జి జడ్జి శ్రీనివాస కల్యాణ్ 14 రోజులు రిమాండ్ విధించారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న కిషోర్‌ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన దాడులు అనంతరం తురక కిశోర్ అజ్ఞాతంలోకి వెళ్లారు. హైదరాబాద్‌లోని పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసేందుకు వస్తున్నాడన్న సమాచారం

2లో

దీక్షల్లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి

అంగన్‌వాడీల ఖాళీలు భర్తీ చేయాలి

సమస్యలపై గుంటూరు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీల ఖాళీల భర్తీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నా గుంటూరు జిల్లాలో నోటిఫికేషన్ విడుదల చేయని కారణంగా సెంటర్లను ఒక్కరే నిర్వహిస్తూ పనిభారం మోయాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. ఏడాదిన్నర క్రితం హెల్పర్ల ప్రమోషన్లకు ఇంటర్వ్యూలు నిర్వహించినా ఇంత వరకూ ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేయలేదన్నారు. తక్షణమే ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ దీక్షలను రమాదేవి అంగన్‌వాడీలకు పూలమాలలు వేసి ప్రారంభించి

2లో

నరసరావుపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న జి.మల్లీశ్వరి

గ్రాట్యుటీ, కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, కనీస వేతనం అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం అరండల్‌పేటలోని బీసీ కాలనీ అంగన్వాడీ సెంటర్

2లో

విలేకర్లతో మాట్లాడుతున్న టిడిపి కార్పొరేటర్లు

వైసిపి బెదిరింపు ధోరణి సరికాదు

టిడిపి కార్పొరేటర్ల ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి హయాంలో చేసిన పనులకు సంబంధించి పలు అక్రమాలు జరిగాయని, అయినా వాటికి బిల్లులు మంజూరు చేయించుకోవడం కోసం అధికారులపై ఆ పార్టీ కార్పొరేటర్లు బెదిరింపు ధోరణితో మాట్లాడటం సరికాదని టిడిపి కార్పొరేటర్లు విమర్శించారు. ఈ మేరకు గుంటూరులోని టిడిపి కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్‌బాబు, వేములపల్లి శ్రీరాం ప్రసాద్, సిత్మపద్మజ, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, శ్రీవల్లి తదితరులు విలేకర్లతో మాట్లాడారు. బుడమేరు వరదల సమయంలో కమిషనరు కౌన్సిల్ అనుమతిలేకుండా నిధుల ఖర్చుపెట్టారని ఆరోపించడం సరికాదన్నారు. అక్రమాలు జరిగినట్టు ఆధారాలు ఉంటే బయటపెట్టాలన్నారు.వైసిపి హయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు గుంటూరులో నిధులు ఖర్చుచేసినట్టు రూ.లక్షల్లో నిధులు స్వాహా చేశారని అన్నారు. నగర అభివృద్ధిలో వారికి చిత్తశుద్ధి ఉందని చెబుతూనే ప్రతిసారి అధికారులను బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తన ధోరణిని మార్చుకోవాలన్నారు. కౌన్సిల్‌లో అభివద్ధి పనులమీద చర్చ జరుగుతుంటే ప్రతీ చిన్న దానికి అడ్డుపడుతున్నాడని అన్నారు. అధికారులను భయబ్రాంతులకు గురిచేయకపోతే మన మాట వినరు, గత 4 సం.లలో మనం చేసిన అక్రమాలన్ని బయటికొస్తాయనే భయంతో డిప్యూటీ మేయర్ కౌన్సిల్ లో రచ్చ చేస్తున్నారన్నారని ఆరోపించారు. అధికారులను బెదిరించి సభను మీకు నచ్చినట్లుగా నడిపిస్తామంటే కుదరదని హెచ్చరించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయంతో సభను నడపాల్సిన మేయర్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం తగదన్నారు. సభలో అలజడి చేలరేగినా మేయర్ ప్రేక్షకపాత్ర పోషిస్తుంటారని తెలిపారు.మేయర్ కి నగర అభివద్ధి మీద చిత్తశుద్ధి లేదన్నారు.బృందావన్ గార్డెన్స్‌లో ఎన్‌టిఆర్ స్టేడియంలో టెండర్లు లేకుండా పరిపాలన ఆమోదంతోనే పనులు ప్రారంభించడంపై అధికారులు అభ్యంతరం పెట్టారని ఈ బిల్లుల కోసం అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. డిప్యూటీ మేయర్ సత్యవంతుడు, నీతిమంతుడిలా మాట్లాడుతున్నారని, డైమండ్‌బాబు నగరంలోని పలు ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడ్డాడని తెలిపారు. డిప్యూటీ మేయర్ చేసిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గ్రీన్‌గ్రేస్‌లో నిర్మాణాలు అపండి : ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక జూట్ మిల్లు స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గ్రీన్ గ్రేసరీ అపార్టుమెంట్స్ విక్రయాలు జరిపేందుకు సంబంధిత నిర్మాణ సంస్థ ప్రయత్నిస్తుందని అయినా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వేశాఖ అభ్యంతరం చెప్పినా తప్పుడు పత్రాలతో నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో నగరపాలక సంస్థకు ఫిర్యాదు చేసినా అధికారులు నామమాత్రంగానే చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైల్వేట్రాక్‌కు సమీపంలోనే నిర్మించడం వల్ల భవిష్యత్తులో ట్రాక్ విస్తరిస్తే అప్పుడు నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డును కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. పనులు నిలిపివేసినట్టు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నా అంతర్గత పనులు జరుగుతున్నాయన్నారు. ఉన్న పళంగా ప్లాట్లు అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. త్వరలో ప్రభుత్వానికి వివరంగా నివేదిక సమర్పిస్తానని తెలిపారు.

మూడోరోజు 159 మంది అర్హత

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిలా ప్రతినిధి

గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సోమవారం మూడోరోజు కొనసాగాయి. ఎస్‌పి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పరీక్షలకు 331 మంది హాజరవగా, వీరిలో 43 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుదిరిగారు. మిగిలిన 288 మంది అభ్యర్థులకు ఫిట్‌మెంట్ పరీక్షలు నిర్వహించగా 14 మంది అనర్హతకు గురయ్యారు. మిగిలిన 274 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 105 మంది అనర్హులవగా 169 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 169 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 21 మంది అర్హత సాధించారు. 148 మంది అనర్హతకు గురయ్యారు. 169 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా 159 మంది అర్హత సాధించగా 10 మంది అనర్హత పొందారు. మొత్తం 288 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 159 మంది అర్హత సాధించగా, 129 మంది అనర్హతకు గురయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ పరిశీలించగా అదనపు ఎస్‌పిలు సుప్రజ, హనుమంతు పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలు నిలిపివేత!

(మొదటి పేజీ తరువాయి)

రూ.1740కు కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1400 మించి కొనలేదు. తేమశాతం బూచిగా చూపి బస్తాకు రూ.350 వరకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వస్తే తక్కువ ధరకు విక్రయించడం వల్ల రైతుకు ఎకరాకు రూ.10 వేలు నష్టం వస్తోంది. గత కొంత కాలంగా ఎండ రాకపోవడం, ముసురు వాతావరణం నెలకొనడంతో ధాన్యం ఎండబెట్టుకునేందుకు అవకాశం లేకపోవడం వల్ల రైతులు అయిన కాడికి అమ్ముకుంటున్నారు. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల కళ్లాల్లో వ్యాపారులు చెప్పిందే వేదంగా రూ.1400 కంటే తక్కువకే అమ్ముకుంటున్నారు. జిల్లాలో 3.85 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలున్నా అందులో 10 శాతం కూడా లక్ష్యం నిర్ధారించకపోవడం వల్ల అధికారులు మిల్లర్లపై వత్తిడి చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ధర కోసం వేచి ఉండే వారు మాత్రం పొలాల్లోనే కుప్పలు వేసి రబీ పంటలు కోతలు పూర్తయిన తరువాత మార్చి, ఏప్రిల్‌లో నూర్పిడి చేసి విక్రయిస్తుంటారు. వేచి ఉండలేని రైతులు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తురకా కిషోర్‌కు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

అందుకున్న మాచర్ల మండలం విజయపురి సౌత్ ఎస్సై షఫీ తన బృందంతో హైదరాబాద్‌లో మాటు వేసి మల్కాజిగిరిలోని జయపురికాలనీలో కిశోర్‌తో పాటు అతడి సోదరుడు శ్రీకాంత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. 2022 డిసెంబర్ 16న మాచర్లలో టిడిపి 'ఇదేం కర్మ' కార్యక్రమం చేపట్టింది. ఆ సమయంలో టిడిపి కార్యకర్తలపై దాడులు, ఆ పార్టీ కార్యాలయ దహనం కేసులో తురకా కిషోర్ ప్రధాన నిందితుడు కాగా ఆయన్ను అరెస్టు చేసి పట్టణ సిఐ ప్రభాకరావు ఆధ్వర్యంలో గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించారు. సోమవారం కిశోర్, అతడి సోదరుడ్ని మాచర్ల కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. విజయపురిసౌత్, వెల్దుర్తి, దుర్గి ఎస్‌ఐల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు మధ్య కిషోర్, శ్రీకాంత్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

అంగన్‌వాడీల ఖాళీలు భర్తీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఆరు నెలల పాలనలో వారి గురించి పట్టించుకోలేదన్నారు. గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా కుప్పంలో అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో చంద్రబాబునాయుడు... తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చాక స్పందించట్లేదని విమర్శించారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై ఏడాది క్రితం సమ్మె సందర్భంగా గత రాష్ట్ర ప్రభుత్వం పలు సమస్యల పరిష్కారానికి రాతపూర్వకంగా అనేక హామీలు ఇచ్చిందని, వాటిని ఇంత వరకూ అమలు చేయలేదని అన్నారు. అంగన్వాడీల జీతాలు పెంచి ఐదేళ్లయ్యిందని, ఈ కాలంలో ధరలు పెద్ద ఎత్తున పెరిగాయని చెప్పారు. పెరిగిన ధరలు, చాలీ చాలని జీతాలతో ఇబ్బంది పడుతుంటే అంగన్వాడీలలో వితంతువులకు ప్రభుత్వం అందించే వితంతు పెన షన్ రద్దు చేయటం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు వితంతు పెన్షన్‌తో సహా అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి, నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ ప్రేమలత, పావని, హెల్పర్ పద్మావతి తదితరులు కూర్చున్నారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శివాజీ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.రమేష్‌బాబ, బి.లక్ష్మణరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసరావు తాడికొండ మండల కార్యదర్శి గాంధీ రామ్మోహన్‌రావు మాట్లాడారు.

పిడుగురాళ్లలో జెండావిష్కరణ

గ్రాట్యుటీ, కనీస వేతనాలు అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణంలో, పిడుగురాళ్ల పట్టణంలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద జెండాను మల్లీశ్వరి ఆవిష్కరించి మాట్లాడారు. మాతా శిశు సంరక్షణకు అంగన్వాడీల సేవలు కీలకమయ్యాయని, ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలని కోరారు. విశేష సేవలందిస్తున్న అంగన్వాడీలు, హెల్పర్లకు ప్రభుత్వాలు నామమాత్రపు గౌరవ వేతనంతో సరిపెడుతున్నాయని, ఇది చాలక అంగన్వాడీలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. యాప్‌ల భారంతో అంగన్వాడీలు పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, మట్టి ఖర్చులు జీవో అమలు చేయాలని కోరారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పర్మినెంట్ చేయాలని, 42 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్తెసరు జీతాలే పొందుతున్న అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు అంగన్వాడీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని అంగన్వాడీలు ఈ స్థాయికి ఎదిగారని చెప్పారు. అనేక పోరాటాల ఫలితంగా వేతనాలు, హక్కులు సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమాల్లో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, సిఐటియు మండల పిడుగురాళ్ల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నరసరావుపేట మండలం అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, అంగన్వాడీ నాయకులు పద్మ, రమణ, సాయి, మాధవి, విజయలక్ష్మి, నిర్మల, డి.శాంతమణి, షేక్. హాజర, శివరంజని, బుజ్జి, నాగమణి, జ్యోతి, పద్మ, నాగమణి, విజయలక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

కౌల్దార్లకు రుణాల కోసం ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలకు భిన్నంగా చిలువూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ ఈసీ తనకా సర్టిఫికెట్ టెన్ వన్ అడంగల్, భూ యజమాని ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటివి తెస్తేనే రుణాలిస్తామని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ మీటింగ్లో కనీసం భూయజమానులు పంట రుణాలు తీసుకోని సందర్భాల్లోనైనా కౌలు రైతులకు పంట రుణాలు ఇస్తామని నిర్ణయం తీసుకున్నారని, దీనిపైనా ఆదేశాలు తమకు రాలేదంటూ కిందిస్థాయిలో బ్యాంక్ మేనేజర్లు చెబుతున్నారని విమర్శించారు. ఖరీఫ్ సీజన్లో కౌలురైతులకు చాలా తక్కువ మందికి రుణాలు ఇచ్చారని, కనీసం రబీలోనైనా ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల చట్టంలో కూడా వెంటనే మార్పు చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను నేరుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కౌల్దార్ల పట్ల ప్రభుత్వ చిన్నచూపు కొనసాగితే ఉధృత ఆందోళనలు చేయకతప్పదని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నాగమల్లేశ్వరరావు, బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే కష్టనష్టాలతో వ్యవసాయం చేస్తున్న కౌల్దార్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, బ్యాంకులపై ఉందన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మేనేజర్ స్పందిస్తూ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి అర్హత ఉన్న కౌల్దార్లకు రుణాలిస్తామని హామీనిచ్చారు. ధర్నాలో నాయకులు టి.రామారావు, కె.ప్రభాకర్‌రావు, ఎన్.దానయ్య, ఎం.గోపి ప్రసాద్, వి.వీరయ్య, వై.స్వప్న, ఎం.సునీత, జి.కృష్ణారావు, ఎస్.వెంకట్రావు చిలువూరు, తుమ్మపూడి, రేవేంద్రపాడు గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌల్దార్లు, నాయకులు

బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లు పెంచండి : ఎంపి లావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో బిఎస్ఎన్ఎల్ నెట్ వర్కును వృద్ధి చేయాలని నరసరావుపేట లోక్‌సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు కోరారు. గుంటూరు చంద్రమౌళి నగర్ బిఎస్ఎన్ఎల్ ఆఫీసులో టెలికం సలహా కమిటీ సమావేశం సమావేశంలో వారు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ రామిరెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సచివాలయాలకు, స్కూళ్లకు బి యస్ ఎన్ ఎల్ ఫైబర్ నెట్ కనెక్టివిటీ ఇవ్వాలని సూచించారు. ప్రైవేటు ఆపరేటర్లతో పోటీగా మొబైల్ వినియోగదారులను బిఎస్ఎన్ఎల్ ఆకర్షించాని కోరారు. ఈమేరకు కనెక్షన్లు పెఓంచుకోవాలన్నారు. నెట్‌వర్కు సేవలను మెరుగుపర్చాలని కోరారు. 4జి టవర్స్ త్వరితగతిన పూర్తి చేయాలనీ సెల్ ఫోన్ సిగ్నల్స్ అన్ని ప్రాంతాలలో కవరేజ్ ఉండే విధముగా చూడాలని చెప్పారు. బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 40 శాతం టవర్స్ ఫోర్‌జిగా మార్చినట్టు తెలిపారు. మార్చిలోగా అన్ని టవర్సు మారుస్తామని తెలిపారు.

మెషిన్ లెర్నింగ్‌పై చలపతి కాలేజీలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఔషధ పరిశోధన, అభివృద్ధి రంగంలో మెషిన్ లెర్నింగ్ అన్వయాలు శాస్త్ర పరిశోధనలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని విట్ -ఎపి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆధునిక సాంకేతికతల సాయంతో మెషిన్‌లెర్నింగ్, ఔషధ అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడంలో, ఖర్చులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెపారు. చలపతి ఫార్మసీ కళాశాలలో సోమవారం 'మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ అండ్ డ్రగ్ డెవలప్మెంట్' అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈవర్క్‌షాప్‌లో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధునిక డేటా ప్రాసెసింగ్ మోడల్స్, అల్గారిథమ్స్ సహాయంతో మెషిన్ లెర్నింగ్, ఔషధ పరిశోధన, అభివద్ధి వ్యయాన్ని తగ్గించడంలో, సమయాన్ని ఆదా చేయడంలో, మానవ జీవితాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 11 కళాశాలల నుండి 160కు విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామారావు తెలిపారు.

వైసిపిపై కూటమి నేతల తప్పుడు ప్రచారం

మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక వైసిపి నేతలపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. విజయవాడ ఇబ్రహీంపట్నంలో వైసిపి నాయకులు సబ్ రిజిస్ట్రార్‌ను భయపెట్టి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారి ఆరోపించారు. సబ్ రిజిస్ట్రార్ ధర్మసింగ్‌పై రెండేళ్ల క్రితమే ఎసిబి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలపై తనిఖీకి వెళితే అప్పట్లో పారిపోయి ఇటీవల బయటకు వస్తే అతన్ని ఎసిబి అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని అన్నారు. రిమాండ్‌లో ఉన్న ధర్మసింగ్ సిఎంకు, లోకేష్‌కు ఎలా ఉత్తరాలు రాస్తారని ఇవ్వన్నీ టిడిపి నాయకులు సృష్టించినవేనన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను, ఆయన భార్య భారతీ ఎదో విధంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఇప్పటికి ప్రతి ఘటనకు వైసిపి నేతలపై నిందలు మోపడం అలవాటుగా మారిందన్నారు. పుష్ప సినిమా తొక్కిసలాటలో మృతి చెందిన వారికి రూ.2 కోట్లు ఇచ్చినట్లుగానే గేమ్ చేంజర్ సినిమాకు వచ్చి రోడ్డు ప్రమాదానికి గురైన మృతి చెందిన మణికంఠ, చరణ్ అనే యువకుల కుటుంబాలకు రూ.2 కోట్ల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ఈవిషయంలో వెంటనే స్పందించాలన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ ట్రాక్టర్ ను మంగళగిరి రూరల్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాలు మేరకు.... సిఆర్‌డిఏ పరిధిలోని నవులూరులో గత కొంత కాలంగా అక్రమ మట్టి తవ్వకాలు, తరలింపు జరుగుతున్నాయని, ఇటీవల ఐదు టాక్టర్లు ఓ జెసిబిని సీజ్ చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేయగా డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కాగా మట్టి త్రవ్వకాలకు వినియోగించిన జెసిబి ఎవరిదనేది విచారణలో తెలియాల్సి ఉందన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెండ్

ప్రజాశక్తి - గుంటూరు

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పాత గుంటూరు ఎల్‌బి నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉపాధ్యాయుడు డి.తిరుపతిరెడ్డిని జిల్లా విద్యాశాఖాధికారి సివి రేణుక సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. తిరుపతిరెడ్డి కొన్నేళ్లుగా విద్యార్థులకు సోషల్ సబ్జెక్ట్ బోధించడం లేదని అందిన ఫిర్యాదు అందింది. దీనిపై మండల విద్యాశాఖాధికారి ద్వారా విచారణ చేయగా ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ ఉత్తర్వులిచ్చారు.

సాగర్ సిమెంట్ కాలనీలో చోరీ

ప్రజాశక్తి-దాచేపల్లి

మండలంలోని శ్రీనగర్ గ్రామంలో సాగర్ సిమెంట్ కర్మాగారంలో ఉద్యోగుల నివాస కాలనీలో ఆదివారం రాత్రి దొంగల బీభత్సం సృష్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కర్మాగారంలో ఉద్యోగుల నివాస కాలనీ బ్లాక్ ఏ 14లో వి శంకర్ నారాయణ రెడ్డి ఉంటున్నారు. ఇంటిలో నివాసం ఉంటున్న వారు 4వ తేదీ నుండి వేరే పనుల మీద వెళ్లి 6వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి ఇంటిలో దొంగతనం జరిగిందని గుర్తించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారాన్ని తెలియపరిచారు . సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇంటి పరిసరాల ప్రాంతాలు, ఇంటి లోపల అన్ని పరిశీలించి ఆ ఇంటి యజమాని వి .శంకర్ నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.పాపారావు తెలిపారు.

రైస్‌మిల్లులో రేషన్ పట్టివేత

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురంలోని రాఘవేంద్ర రైస్‌మిల్లులో అక్రమంగా ఉన్న 335బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని రైస్‌మిల్లు నిర్వాహకునిపై కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ జె ప్రసాదరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న రేషన్‌ను గుంటూరులోని శ్రీ భార్గవ సాయి రైస్‌మిల్లులో భద్రపరిచినట్లు తెలిపారు. మండలంలోని కండ్రికలో డీలర్ శ్రీలక్ష నిర్వహించే షాపును తనిఖీలు నిర్వహించామని రేషన్ 5775కేజీల వ్యత్యాసం ఉందని, ఆమెపై కేసు నమోదు చేయాలని సిఫార్సు చేశామని తహశీల్దార్ తెలిపారు.

దావా సమను

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్.నెం. 203/2022

బిట్వీన్ :

మారం వెంకట సీతారామయ్య .... వాది

మరియు

వాసిరెడ్డి అప్పారావు ... ప్రతివాది

To,

ప్రతివాది : వాసిరెడ్డి అప్పారావు, తండ్రి : లింగారావు, కోనూరు గ్రామం, అచ్చంపేట మండలం, పల్నాడు జిల్లా.

పై దావాలోని ప్రతివాదికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై దావాలోని వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దావా వేయగా మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనకుండా ఉద్దేశ్య పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. గాన పై దావాలో మీ అప్పీరెన్స్ నిమిత్తం ది.28-01-2025వ తేదీన పై కోర్టువారి వాయిదా వుండివున్నది. వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వులతో)

దివ్వెల శ్రీనివాసరావు,
వాది తరపు న్యాయవాది, సత్తెనపల్లి.

బహిరంగ ప్రకటన

To,

సంబంధీకులెవరైనప్పటికి

నా క్లయింట్ కొండెపాటి మాధవి ఎలియాస్ చట్టు మాధవి D/o చట్టు లక్ష్మి, నందిగామ గ్రామం సత్తెనపల్లి మండలం పల్నాడు జిల్లా నుండి సమాచారము పొంది ఆమె సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సత్తెనపల్లి కోర్టులో డిక్లరేషన్ దావా ఒ.యస్.నెంబర్ 647/2024 గా దాఖలు చేయగా మూడవ ప్రతివాదిగా చేర్చిన whoom ever concerned కి సంబంధించి శ్రీ కోర్టు వారు బహిరంగ ప్రకటన జారీకి అనుమతించగా

లేటు చట్టు లక్ష్మి తండ్రి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయిని, నా క్లయింట్ కొండెపాటి మాధవిని దత్తు తీసుకొని 7 సంవత్సరాల వయస్సులోనే భాద్యతలు స్వీకరించి తరువాత దత్తత స్వీకార పత్రం, వీలునామా, రాయించి, అంతేకాక ఆమె చేసిన, పోస్టల్, లైఫ్ ఇన్సూరెన్సు పాలసీలలో కూడా తన తల్లి పేరు తొలగించి దత్తపుత్రిక అయిన నా క్లయింట్ కొండెపాటి మాధవిని చేర్చుటం తదితర అంశాలన్నింటిలో మృతురాలు చట్టు లక్ష్మికి సర్వసంపూర్ణ వారసురాలని పై కోర్టులో డిక్లరేషన్ దావా వేయడం సంబంధీకులెవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల వాయిదా ది. 23-01-2025న పై కోర్టు ఎదుట హాజరై మీరు నేరుగా గాని, మీవకీలు ద్వారా గాని అభ్యంతరములు తెలుసుకొనవచ్చును.లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

ఇట్లు
ఉల్లం శేషగిరిరావు
వాది తరపు న్యాయవాది
సత్తెనపల్లి.

దస్తావేజులు పోయినవి

దేవనబోయిన శౌరిరాజు నాయుడు, తండ్రి.థామస్ నాయుడు, డోర్ నెం.12-25-11,కొత్త పేట, గుంటూరు సిటీ, అను నేను యావన్మందికీ తెలియ జేయునది ఏమనగా, పెదకాకాని గ్రామ డి.నెం. :436 లో ఉన్న నా ఖాళీ స్థలం తాలూకు గుంటూరు రిజిస్ట్రారు వారి ఆఫీసులో ది: 18-08- 1983న రిజిస్టరు అయిన ఒరిజినల్ దస్తావేజు నెం:7018/ 1983 మరియు దాని లింకు దస్తావేజు నెం:936/ 1964 లు నేను గుంటూరు నుండి చిలకలూరిపేట వెళ్తుండగా మార్గమధ్యంలో యడ్లపాడు వద్ద ఆగి ఫోటోస్టాట్ కాపీలు తీయించి ఫైలులో పెట్టెక్రమంలో ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికినచో ఈ కింది అడ్రస్ లో అందజేయగలరు.

దేవనబోయిన శౌరిరాజు నాయుడు,
డోర్ నెం: 12-25-11,
కొత్తపేట గుంటూరు.
సెల్: 9848134049.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : PENUKONDA.

O.S.66/2017

Between:

Chadraiah and others ...Plaintiffs

And

Anjinappa and Others ...Defendants

NOTICE TO THE DEFENDANTS NO.15 and 17

To.

D15. Meera Meri Varghese, D/o.D.Ramesh, S/o.Anjinappa, Block-9, G-4, Visweswaraiah Nagar, Srinagar Colony, Vishakapatnam, Pedagantyada, BHPV, Vishakhapatnam City.

D17. A.Kiranmaya Sharma, S/o.A.Leela Suka Sharma, D.No.2-177, Kakani Village, Narasaraopeta Mandal, Guntur District.

వాదులు మీ పైన భాగపరిష్కారం కొరకు పై దావా కోర్టు నందు వేసినారు. అందులో మిమ్ములను క్రింద ప్రతివాదులుగా చేర్చు ఆర్జీలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీకు చేరి ఉండలేదు. కావున ఈ ప్రకటన చూసిన అనంతరం పైకోర్టు నందు **20-1-2025**వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని పైకోర్టు నందు హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానిచో మీ పరోక్షము నందు దావా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

వాయిదా తేది :20-1-2025

//By Order of the Court//

సి.ఆర్.నాగార్జున, ఎం.ఏ.ఎం.ఎల్.,
అడ్వకేట్, పెనుకొండ,
సెల్: 9492584259.

IN THE COURT OF THE MOTOR ACIDENTS CLAIMS TRIBUNAL,I Additional .DISTRICT, and sessions JUDGE AT: KHAMMAM

MATOP NO 46/2024

Between:

1) Gunuguntla Nagamani
2) Gunuguntla Nagaraju
3) Gunuguntla Laxmi prasanna
4) Gunuguntla Lohitha
5) Gunuguntla Asritha

.... Claim Petitioners

AND

1) A. Vijay kumar
2) A. Srinu@srinivasarao
3) U. Pedda kashaiah

.... Respondents

To
Respondents

1)Alakuntla vijay kumar. s/o. Srinivasa rao, age: 31 years , Occ: Driver of Trolly Auto bearing no AP39 TN 1431 ,R/o Danavai gudem, khammam , N/o H. No 9-436, Gandhi nagar street, piduguralla Town, Guntur District A.P

2)Alakuntla srinu @ Srinivasa rao, s/o Guravniah, age 54 years occu:owener of trolley Auto bearing No AP 39 TN 1431,r/o danavai gudem, khammam. N/O 9-437/1 gandhi nagar street, piduguralla town, Guntur District. A. P

3)Ustyala pedda kasaiah s/o chinna kesavulu, occu:regd owner of trolley Auto bearing. No Ap 39 TN 1431, R/o H. No 5-258, Bellamkonda x Road, Gagireddi palem(v) Bellamkonda (m) Guntur district, A. P

NOTICE

Take Notice that the above named claim petitioner have filed the above O.P. against the respondents claiming compensation. the above case is stands posted to 20 --01-2025 for your appearance.Therefore, you are here by directed to appear before the Hon'ble court on 20- 01-2025 at about 10.30 A.M in person or through an advocate without fail. Filing which the matter will be decided ex-parte against you.

//By order of the court //

SHAIK NAGULMEERA
Advocate, Khammam
Cell:9000067476

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL SMALL CAUSES II COURT AT CHENNAI

M.C.O.P.No.4460 OF 2023

Banthu Malla Reddy S/o.Raghava Reddy, 1-365, Srinagar, Ramapuram, Guntur, Andhra Pradesh District-522414.

....Petitioner

Vs

1.Vadisala SubbaReddy, S/o.Pedda Appireddy,
2. The Manager,
ICICI Lombard General Insurance Co,Ltd.,

....Respondents

TO

Vadisala SubbaReddy, S/o. Pedda Appireddy, 4-315, Main road, Dachepalli, Nadikundi, Dachepalli, Palnadu, Andhra Pradesh -522414

Sir,

The above MCOP was filed by the Petitioner against you before the Small Causes II Court Chennai and ordered notice to you returnable by 03.02.2025, Please take notice that the above MCOP case was posted on 03.02.2025 for your appearance and appear on that day at 10.30 AM either in person or through your counsel, failing which the matter will be called in your absence and decided on merits.

Counsel for Petitioner

R.VETRIVEL, B.A., B.L.,
ADVOCATE, No.32/16, Errabalu Street, 1st Floor, Parris, Chennai-600001.

KANAKADURGA FINANCE LIMITED

(RBI ద్వారా గుర్తింపు పొందినది)

బ్రాంచిఆఫీస్ : 6-9-18/ఎ, 1వ అంతస్తు, 9/1 అరండల్‌పేట, లిబాస్ బిల్డింగ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రక్కన, గుంటూరు.
-1st ఫ్లోర్, మహావీర్‌కాలేజ్ ఎదురు, మెయిన్‌రోడ్, గుంటూరు- నల్లచెరువు. - బ్రాంచ్ ఆఫీస్ : రేపల్లె.
-బ్లాక్ నెం.21, #21-241,1st ఫ్లోర్, రూరల్ పోలీస్‌స్టేషన్‌రోడ్, వినాయకుడి గుడి దగ్గర, చిలకలూరిపేట-522616. ఫోన్ :9100202258

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 543.63 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు :డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్

కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్

H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.

Mahesh-Cell : 80088 12798

ప్రజాదర్బార్‌లో 236 అర్జీలు

ప్రజాశక్తి - వినుకొండ : మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరవగా ప్రజల నుండి 236 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. జూన్‌లోపు ఇంట్లో ఎంతమంది బడికి వెళ్తే అంతమందికి రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' అందుతుందని, ఏప్రిల్ 1 నుంచి కోటి 43 లక్షల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమాను అమలు చేయబోతున్నామని చెప్పారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చైర్మన్

ప్రజాశక్తి -దాచేపల్లి : ప్రజాశక్తి రూపొందించిన 2025 క్యాలెండర్‌ను నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజలకు వాస్తవాలను తెలిజేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ప్రజాశక్తి ముందుకు సాగుతోందన్నారు. నగర పంచాయతీ ప్రజలకు, నాయకులకు, అధికారులకు, మండల ప్రజలకు, ప్రజాశక్తి సిబ్బందికి శుభాకాంక్షలుతెలిపారు. కార్యక్రమంలో యరంశెట్టి సైదయ్య, మునగ శ్రీనివాసరావు, మందపాటి దుర్గారావు, కె.రవి, రామకృష్ణ, జి.సైదారావు, హెచ్ కోటేశ్వరరావు, హరిదాసు బాలు పాల్గొన్నారు.

చెస్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - మాచర్ల : పోటీల్లో గెలుపోటములు సహజమని, అయితే గెలుపునకు ఓటమి పునాది అవుతుందని శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక కోదండరామ దేవాలయ ఆవరణలో పల్నాడు చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ సహకారంతో యు-15 చదరంగం పోటీలు ఆదివారమూ కొనసాగాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవానికి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గెలుపోటములు ముఖ్యం కాదని పోటీల్లో పాల్గొనటమే ముఖ్యమని అన్నారు. కార్యక్రమానికి వాసవి క్లబ్ అధ్యక్షులు బవనాసి రవితేజ అధ్యక్షత వహించగా వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యదర్శి బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బి.రాజ్ కుమార్, ఫాస్ట్ రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరావు, ఫాస్ట్ ప్రెసిడెంట్ టి.వెంకట నాగేశ్వరరావు, సత్యనారాయణ, కోచ్ కిరణ్ పాల్గొన్నారు.

బఫర్ గోదాములో జెసి తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లాలోని నరసరావుపేట స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ బఫర్ గోదాములను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనూరే సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు.

గుమస్తా మోసంపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు వచ్చే ప్రతీ ఫిర్యాదూ పరిష్కారం కావాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుండి 64 వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలతో వచ్చే ప్రజల సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతుల వద్ద రూ.7 కోట్ల కందులు, శనగలు కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన చిలకలూరిపేటకు చెందిన కోల్డ్ స్టోరేజ్ గుమస్తా గోగుల నాగరాజుపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని ఏపి రైతు, కౌలురైతు సంఘాల సంఘం పల్నాడు కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మండలం ఏలూరు, కుక్కపల్లివారిపాలెం, బాపట్ల జిల్లా యద్దనపూడి, చింతపల్లిపాడు, గన్నవరం, గుంటూరు జిల్లా పరిటాలవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు గత ఏడాది పండించిన శనగ, కందులను ధర లేకపోవడంతో చిలకలూరిపేట మండలంలోని విగ్నేశ్వర కోల్డ్ స్టోరేజ్, యద్దనపూడిలోని శ్రీనివాస కోల్డ్ స్టోరేజ్, పసుమర్రులోని లలిత, మహాలక్ష్మి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారన్నారు. చిలకలూరిపేట కోల్డ్ స్టోరేజ్‌లో గుమస్తాగా పనిచేస్తున్న గోగుల నాగరాజు శనగ, కందులకు మంచి ధర ఇప్పిస్తానని, 10 రోజుల్లో నగదు చెల్లిస్తానని రైతులను నమ్మించి తక్కువ ధరకు మిల్లర్లకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడన్నారు. నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న రైతులు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు నాగరాజును బెయిల్‌పై విడుదల చేశారన్నారు. దీనిపై రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. బాధితుల్లో కౌలు రైతులు కూడా ఉన్నారన్నారు. నాటి, నేటి ప్రభుత్వాలు కందులు శనగ పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి ఉంటే రైతులకు ఇటువంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు జోక్యం చేసుకొని బాధిత రైతులకు న్యాయం చేయాలని, మద్దతు ధర ప్రకటించి రైతులు పండించిన అన్ని ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ ధరకు రైతులకు సంబంధం లేకుండా శనగలు కందులు కొనుగోలు చేసిన మిల్లర్లపైనా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు ఎస్.కోటేశ్వరరావు, బుల్లి స్వామి, అజయ్ కుమార్, పెరవలి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, చిగురుపాటి రాజబాబు, శేషగిరిబాబు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు ఎస్పి జెవి సంతోష్ సిబ్బందికి సూచించారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి 84 ఫిర్యాదులు స్వీకరించారు. రొంపిచర్లకు చెందిన తుర్లపాటి పున్నయ్య భార్య పదేళ్ల కితం మృతి చెందగా చిన్న కుమారుడు వద్ద ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా తన పేరిట ఉన్న మూడెకరాల పొలాన్ని తన చిన్న కుమారుడు తుర్లపాటి శ్రీనివాసరావు సాగు చేస్తున్నాడు. ఇప్పుడు తన పెద్ద కుమారుడు, కుమార్తె కలిసి భూమిని సాగు చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పున్నయ్య ఫిర్యాదు చేశారు.

వేర్వేరు కుల జాబితాల్లో బేడ బుడగ జంగాలు

ఎస్సీ జాబితాలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి - ఈపూరు

బేడా, బుడగ జంగాల వివరాలను 2024-25 ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ బేడా, బుడ్గా జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉన్నం నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఈపూరులో సోమవారం ప్రదర్శన చేసి తహసిల్దార్ ఎ.నళినికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ ఈపూరులోని 27 కుటుంబాలను ఎస్సీ కులాల జాబితాలో చేర్చలేదని, 8 కుటుంబాలను వేరు వేరు కులాల పేర్లతో నమోదు చేశారని చెప్పారు. ప్రభుత్వ ఆదరణ లేక విద్య, ఉద్యోగ, వైద్యం, సాంఘిక, సంక్షేమ, రాజకీయ లబ్ధికి దూరంగా జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కప్పెర పరమేష్, ఆలేటి పట్టాభి రాములు, ఆలేటి ఎల్లయ్య, కప్పెర వెంకటరామయ్య, ఆలేటి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇదే అంశంపై కారంపూడిలోనూ తహశీల్దార్ పుల్లారావుకు ఉన్నం నాగేశ్వరరావు వినతిపత్రం ఇచ్చారు. పేటసన్నెగండ్ల పంచాయతీ పరిధిలోని పోతురాజు గుట్ట కాలనినందు నివసిస్తున్న సుమారు వంద బేడా బుడగ జంగాల కుటుంబాలకు బీసీ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారని, దీనివల్ల అన్యాయం జరుగుతోందని, పిల్లలు చదువుకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి 59వ ఉపకులంలో షెడ్యూల్ 9 ప్రకారం ఎస్సీ ధ్రువపత్రం ఇవ్వాలని కోరారు.

తప్పుల తడకగా జాబితా

ప్రజాశక్తి - పెదకూరపాడు

కుల గణనను సవరించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ పల్నాడు జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ దానియేలుకు సోమవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో కులగణన తప్పుల తడకగా ఉందన్నారు. ఎస్సీ జనాభాలో పలుచోట్ల మాదిగ బదులు మాల నమోదు కావటం, మాదిగ బదులు క్రిస్టియన్‌గా నమోదు కావడం, ఇంకా ఇతర సామాజిక తరగతులుగా నమోదు అయ్యిందని చెప్పారు. వీటిని వెంటనే సవరించాలన్నారు.

కార్యాలయాల వద్ద ప్రకృతి వ్యవసాయ పంటల విక్రయాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆహారానికి ఎంతో రుచిగాను, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డిపిఎం అమల కుమారి అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద స్టాల్ ఏర్పాటు చేసి, అనేక రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు కూడా ఈ విధంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అందరికీ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందజేయడానికి ముందుకు వస్తున్నారని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కోరారు. ఇదిలా ఉండగా ప్రకృతి వ్యవసాయ పోస్టర్లను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, కె.అమల కుమారి ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఆరోగ్యకరమైన జీవితానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలని పిడుగురాళ్ల తహశీల్దార్ జి.మధుబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని ప్రారంభించారు. డిప్యూటి తహశీల్దార్ సుధాకర్ శర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు, విఆర్‌వో సుభాని పాల్గొన్నారు.

ప్రజాశక్తి -దాచేపల్లి

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల అమ్మకం కోసం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి ప్రారంభించారు. వెలుగు ఎపిఎం రవికుమార్, యూనిట్ ఇన్‌ఛార్జి రమేష్, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సేంద్రియ ఎరువులతో పండించిన వివిధ రకాల కూరగాయలు విక్రయించేందుకు తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో కేంద్రం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయాధికారి బ్యులా మాట్లాడుతూ రసాయనాలతో

నరసరావుపేటలోని విక్రయ కేంద్రం వద్ద అధికారులు

పండిన కూరగాయలు కాకుండా సేంద్రియ ఎరువులు వాడిన కూరగాయలతో ఆరోగ్యానికి డోకాలేదన్నారు. ఆకుకూరలు, పచ్చిమిర్చి, టమాట, కాకరకాయ, బీరకాయ, దొండకాయ ఇలా అన్నిరకాల కూరగాయలు సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్నామని తెలిపారు. వీటిని ప్రతి సోమవారం అమ్ముతామని చెప్పారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. వీటి ప్రాధాన్యతను నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామ ప్రకృతి వ్యవసాయ పైలట్ ప్రాజెక్టు యూనిట్ ఇన్‌ఛార్జి కె.పూజ, ఐసిఆర్పీ సౌజన్య వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఎంపిడిఒ విలియమ్స్, ఈవోఆర్డి రూపావతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎపిఎమ్ బాలస్వామి, చాగంటివారిపాలెం పంచాయతీ కార్యదర్శి శివపార్వతి సందర్శించారు.

జిల్లాలో 17,96,356 మంది ఓటర్లు

ప్రజాశక్తి-గుంటూరు

స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 17,96,356మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మీ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాధ్‌తో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్‌పై రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025కు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని ప్రక్రియలు నిర్వహించి తుది ఓటర్ల జాబితాను 2025 జనవరి 6న పబ్లిష్ చేయటం జరుగుతుందన్నారు. ఎస్ఎస్ఆర్ 2025 తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాలలో ఓటర్లు పురుషులు 8,66,871 మంది, స్త్రీలు 9,27,601 మంది, థర్డ్ జెండర్ 161 మంది, సర్వీస్ ఓటర్లు (పురుషులు 1651, మహిళలు 72) 1,723 మంది మొత్తం జిల్లాలో 17,96,356 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎస్ఎస్ఆర్ 2025 డ్రాఫ్ట్ జాబిత ప్రదర్శించిన తరువాత తుది ఓటర్ల జాబితాలో 608 ఓటర్లు పెరిగారన్నారు. అదే విధంగా జిల్లాలో పోలింగ్ బూత్ ల రేషనలైజేషన్ తరువాత ప్రస్తుతం 1920 ఉన్నయన్నారు. అదే విధంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటర్ల నమోదుకు, తప్పుల సవరణకు ధరఖాస్తు చేసుకోవచ్చని, ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిన వెంటనే సంబంధిత ధరఖాస్తులను పరిష్కరించటం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకొని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు సరఫరా , మరుగుదొడ్ల నిర్మాణాలు సంక్రాంతి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మంజూరు చేసిన కిచెన్ గార్డెన్లు, టాయిలెట్లు రిపేర్లు, మంచినీటి సౌకర్యం , రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ తదితర పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖల ద్వారా వెంటనే ప్రారంభించేలా ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాల న్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, సిపిఓ శేషశ్రీ పాల్గొన్నారు.

20 నుండి కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమం

ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి జిల్లా నుండి కుష్టు వ్యాధిని పూర్తిగా పారద్రోలేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ పేర్కొన్నారు. కలక్టరేట్‌లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై నిర్వహించిన జిల్లా స్థాయి కో ఆర్డినే షన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జనవరి 20 నుండి ఫిబ్రవరి 2 వరకూ జిల్లా వ్యాప్తంగా 1177 టీములు ఏర్పాటు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నా మని చెప్పారు. గతేడాది 48 కేసులు గుర్తించామని, అలాగే ఇప్పటి దాకా 78 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జెడి కళావతి, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను కళాశాల విద్య ఆర్‌జెడి కళావతి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులకు ఆమె అభినందనలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్ ప్రచురణకు సహకరించిన వారికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు యశ్వంత్, నాయకులు సౌమ్య, సుభాని, సుధీర్, కార్తీక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

భవన నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం స్థానిక డొంకరోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు పశ్చిమ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలోనైనా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఉచిత ఇసుకను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం తరపున పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు, జోన్ అధ్యక్షులు కె.సీతయ్య, రాజు, యం.సారధి, బుజ్జి, బ్రహ్మయ్య, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని వెలవర్తిపాడు గ్రామంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును సిపిఎం నాయకులు సోమవారం వ్యతిరేకించారు. ప్రభుత్వ ఆఫీసులకు, చిరు వ్యాపార సముదాయాలకు ఇప్పటికే మీటర్ల బిగించారు. మరికొన్నింటికి బిగించడానికి సిద్ధమయ్యారన్న సమాచారంతో చిరు వ్యాపారులను సిపిఎం నాయకులు బి రామకృష్ణ తదితరులు కలసి స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని తెలిపారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోరాటాలు చేపట్టి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించకపోతే ఈ రాష్ట్రం ఆదాని, అంబానీల రాష్ట్రంగా మారబోతున్నది అని తెలిపారు .ప్రజలందరూ ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే ఇమామ్ షరీఫ్, ఎస్ కే సుభాని, ఎస్కే కరిముల్ల, దాసరి శేషగిరిరావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కొల్లిపర : అక్రమంగా విధుల నుండి తొలగించిన చేబ్రోలు పంచాయతీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసు కోవాలని రైతు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొల్లిపర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసనలో రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, సిఐటియు నాయకులు కోట చంద్రశేఖర్ మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్న కార్మికుల్ని అన్యాయంగా తొలగించటం దుర్మార్గం అని అన్నారు. ఎటువంటి ఆరోపణ లేకుండా చట్ట విరుద్ధంగా తొలగించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో గోదాసుందర్రావు మల్లోల రమేష్ సీతమ్మ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను యథావిధిగా ఉంచాలి : అఖిలపక్షం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రోడ్డు వెడల్పు పేరుతో ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామం ప్రధాన రహదారి వెంట ఉన్న పేదల ఇళ్లను తొలగించకుండా, యథావిధిగా ఉంచాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ప్రాతూరులో సిపిఎం నాయకులు డోకిపర్తి రాజేంద్రబాబు అధ్యక్షతన సమావేశంలో సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన, వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివ శంకరరావు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా గ్రామం లోని ప్రధాన రహదారి వెంట ఉన్న పేదల ఇళ్లను, ఇప్పుడు రహదారి వెడల్పు పేరుతో తొలగిస్తామని తాడేపల్లి మండల అధికారులు నోటీసులు ఇవ్వడం అన్యాయం అని అన్నారు. గ్రామంలో రహదారి వెంట ఎవ్వరికీ ఎటు వంటి ఇబ్బంది లేకపోయినా, అర్ధాంతరంగా నోటీసులు ఇచ్చిన 15 రోజులలో ఖాళీ చేయమంటే పేదలు ఎక్కడికి పోతారని ఆయన ప్రశ్నించారు. సిపిఎం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కూలి, నాలి చేసుకునే పేదలు మండల అధికారులు నోటీసులు ఇవ్వడంతో భయాందోళనలో ఉన్నారని అన్నారు. ఒకవేళ అనివార్యం గా పేదల ఇళ్లను తొలగించాల్సి వస్తె ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా గ్రామీణ ప్రాంతాలలో పేదలకు 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి,గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమం లో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం నాయకులు బుర్ర రాజు, టిడిపి బి సి సెల్ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి దావులురి శ్రీనివాసరావు, తెలుగు యువత మంగళగిరి నియోజకవర్గ నాయకులు సంకూరు నాని,వై యస్ ఆర్ సిపి నాయకులు సంకూ రు మరియ బాబు, జన సేన గ్రామ అధ్యక్షులు సంకూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి పి శ్వేత

గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని నాగుల పాడు పంచాయతీ కార్యదర్శి పి శ్వేత పిలుపునిచ్చారు. సోమవారం గ్రామ సర్పంచ్ పాలపర్తి శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో కార్యదర్శి శ్వేత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సహకరించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా పంచాయతీ కార్మికులకు ఇళ్ల వద్ద అందించాలని కోరారు. గ్రామంలో చేపట్టబోతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామ సభలో తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదర్శగ్రామంగా అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొల్లపూడి శ్రీనివాసరావు, పాటిబండ్ల మురళి, బండి వాసు, కె వెంకట్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళారంగంలో వరప్రసాద్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - తెనాలి

కళా రంగానికి వేద గంగోత్రి ఫౌండేషన్ అధ్యక్షులు జీవీఎంఆర్ఎస్ ఎస్ ఎస్ వరప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మరణించిన వరప్రసాద్ సంస్మరణ సభ కళల కాణాచి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. సభకు వరప్రసాద్ సోదరి సిస్టా రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. నిర్వహణ సంస్థ ఉపాధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగిన సభలో తొలుత వరప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళల కాణచి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ ప్రతి ఏటా కళల కాణాచి సంస్థ, వేద గంగేత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వీణ అవార్డ్స జాతీయస్థాయి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది నిర్వహించే నాటకోత్స వాలలో వేద గంగోత్రి వరప్రసాద్ నిర్వహణ పురస్కారాన్ని ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఈ పురస్కారం కింద రూ.11,116 నగదు పురస్కారాన్ని కూడా అందించనున్నట్లు చెప్పారు. కళా రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాటకోత్సవాలలో ప్రదర్శించిన వివిధ నాటికల సంకలనంతో ఆకుల మల్లేశ్వరరావు రూపొందించిన రంగ విపంచిక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిస్టా రవితేజ, వి విజయభాస్కర్, గోపరాజు విజయ్, వసంత యామిని, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, టి హరి ప్రసాద్, పలువురు కళా రంగ ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ మోడరన్ ఆర్ట్స్ థియేటర్ వారు కాంట్రవర్సీ నాటికను ప్రదర్శించారు.

కాంట్రవర్సీ నాటికలో సన్నివేశం

శివారు భూములకూ సాగునీరు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఆకురాజుపల్లి మేజర్, తంగెడ మేజర్ శివారు భూముల వరకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యం అని నీటి వినియోగదారుల సంఘం చైర్మన్లు గండికోట వెంకటేశ్వర్లు, పగడాల భాస్కర్‌రావు తెలిపారు. సోమవరం పట్టణంలోని జానపాడు రోడ్డు వద్ద గల నీటిపారుదల శాఖ కార్యాలయంలో నాగార్జున సాగర్ కుడి కాలువ నీటి వినియోగదారుల సంఘం మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దాచేపల్లి జలవనరుల శాఖ ఏఈఈ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మేజర్ కాల్వల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. కనీసం నిధులు కేటాయింపు కూడా జరగలేదన్నారు. రెండు మేజర్ కాలువల మరమ్మతులు చేసి ప్రతి ఎకరాకూ నీరు అందించి రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. అందుకోసం ప్రణాళిక ఏర్పాటు చేయాలని తెలిపారు.

పేదలకు అండగా నిలవడం అభినందనీయం

ప్రజాశక్తి - అమరావతి

సామాజిక కార్యక్రమాల ద్వారా పేదవారికి అండగా ఉండటం అభినందనీయమని బాపట్ల ఏరువాక కేంద్రం అధికారి బివిఎస్ వరప్రసాద్ పురమా అన్నారు. రాణా వెల్ఫేర్ సొసైటీ సౌజన్యంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన అమరావతి యానాది కాలనీలోని కుటుంబాలకు వస్త్రాలు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబశివరాయల్, సుంకర పార్థసారధి, సిహెచ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జంగా పరామర్శ

ప్రజాశక్తి - దాచేపల్లి

ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సోమవారం శాసనమండలి సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి పరామర్శించారు. పట్టణానికి చెందిన కోరే మోహన్ రావు, కోలా గోపాల్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అనాథ వృద్ధులకు, యాచకులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర యాచకులకు, వృద్ధులకు, అనాథలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ చల్లా వెంకటేశ్వర్లు 30 మందికి వైద్య పరీక్షలు చేశారు.అవసమరైనవారికి ఉచితంగా మందులు అందజేసినట్లు సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు.

మిరప పంట పరిశీలన

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రకృతి సేద్యంలో సాగవుతున్న మిరప పంటను పెదకూరపాడు తహసిల్దార్ డానియేలు సోమవారం పరిశీలించారు. అభ్యుదయ రైతు దర్శి శేషారావు పొలంలో పేడ మూత్రం, ఇంగువ ద్రావణాన్ని పిచికారీ చేయగా.. ఈ విధానాన్ని తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. ఈ ద్రావణం రసం పీల్చే పురుగులైన నల్లి, దోమ నివారణకు ఉపయోగపడుతుందని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్.ఎస్.ఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చంట్స్ రాష్ట్ర అధ్యక్షులు టిడిపి నాయకులు కపలవాయి విజయకుమార్ జన్మదినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ది టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాసనగర్ లోని కట్టా రాములు వద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. అభిమానులు ఎండి షంషీర్ అలీ, షేక్ నాగుర్ వలి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో యువకుడు హల్‌చల్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని మారుతినగర్ వద్ద ఆదివారం రాత్రి సమయంలో యువకుడు కత్తితో హల్‌చల్ చేశాడు. ప్రధాన రహదారిపై కత్తి పట్టుకొని హల్‌చల్ చేస్తుండగా అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి, అతనిని అదుపులోకి తీసుకున్నారు. యువకుని పేరు తమ్మిశెట్టి డేవిడ్ రాజు అని, కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచామని పోలీసులు తెలిపారు. నిందితుడికి స్థానిక న్యాయమూర్తి 15రోజులు రిమాండ్ విధించారు.

రవికుమార్‌కు పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన కళాకారుడు బెజగం రవి కుమార్‌కు 'భారత పౌరాణిక రంగస్థల నటకళా తేజ పురాస్కరం లభించింది. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో ని కరవాది గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంవిఆర్ కల్చరల్ అకాడమీ, లిటిల్ ఛాంప్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

అనుపు పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అవసరం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని ప్రసిద్ధిగాంచిన అనుపు బౌద్ధ పర్యాటక రంగ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ కోరారు. బౌద్ధ పర్యాటక కేంద్రమైన అనుపునకు ప్రపంచ దేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని.. అక్కడి సౌకర్యాలను మెరుగుపరచాలని విన్నవించారు. అనుపులోని పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్ గ్రామాన్ని ఇటీవల పంచాయతీ ఏర్పాటుకు అధికారులను ఆదేశించిన నేపథ్యంలో.. ఎన్నికల నాటికి ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని కోరారు.

పురోహిత సేవాసమితి అధ్యక్షునిగా ఆంజనేయ శర్మ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య బ్రాహ్మణ అర్చక పురోహిత సేవా సమితి మాచర్ల నియోజకవర్గ అధ్యక్షులుగా ఎస్.ఆంజనేయ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సాగర్‌రోడ్ లోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో మాచర్ల నియోజకవర్గ బ్రాహ్మణుల సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులుగా సాగి వెంకటేశ్వర శాస్త్రి, గొట్టిపాల్ల కృష్ణమాచార్యులను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకట సుబ్బారావు, కోశాధికారిగా శ్రీనివాసశర్మ, గౌరవ సలహాదారులుగా వడ్లమాను రమణాచార్యులు ఎన్నికయ్యారు.

సామాజిక పింఛన్లపై వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సామాజిక పెన్షన్లల పంపిణీపై ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లా యీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకట్రామిరెడ్డికి ప్రభుత్వం మారి ఏడు నెలలు గడుస్తున్నా ఇంకా వైసిపి వాసన పోలేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు నెలలుగా వేతనాలు ఇవ్వకపోయినా ఎన్నడూ నోరు మెదపలేదన్నారు. పింఛన్ తీసుకునే ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ చేస్తున్నారన్నారు. గతంలో పింఛన్ల పంపిణీ కి కొన్ని వేల మంది సచివాలయ ఉద్యోగులని ప్రభుత్వం ఉపయోగించిందని, సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడకుండా ఇంటికి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీసీ రహదారి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం గుడిపూడిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం భూమి పూజ చేశారు. గ్రామంలోని బీసీ కాలనీ లో రూ.13లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్యుత్ ఛార్జీలపై బహిరంగ విచారణ

ప్రజాశక్తి-కారంపూడి

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై విద్యుత్ వినియోగదారుల నుంచి బహిరంగ విచారణ ద్వారా ఈఆర్‌సీ అభిప్రాయాలను సేకరిస్తోందని.. వినియోగదారులు తమ అభ్యంతరాలను మంగళవారం, బుధవారం, శుక్రవారం మాచర్లలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయంలో తెలియజేయవచ్చునని మాచర్ల ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.సింగయ్య, కారంపూడి మండల ఏఈ వీరాంజనేయులు తెలిపారు. ఈ విచారణలో పాల్గొనదలచిన వారు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి ఐదు సాయంత్రం గంటల్లోపు తమ పేర్లను నమోదు చేయించుకుని కార్యక్రమంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి గల్లంతై మృతి చెందిన నల్లూరి గోపీచంద్‌కు వైసీపీ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది చిట్టా విజయభాస్కర్ రెడ్డి నివాళులర్పించారు. మృతుని తల్లిదండ్రులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'విద్యావ్యవస్థను నాశనం చేసిన జగన్'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నాశనం చేసిన గత ముఖ్యమంత్రి జగన్.. విద్యావంతులకు ఉద్యోగాలు లేకుండా చేశారని సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించారని తెలిపారు. త్వరలో జరగబోయే గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేదావులు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. సత్తెనపల్లి పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలి..

ప్రజాశక్తి - యడ్లపాడు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, పంచాయతీలో తీర్మానం చేయాలని సోమవారం యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పుల్లగూర ప్రభావతికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందించారు. ప్రధానమంత్రి నుంచి పంచాయతీ సర్పంచి వరకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ సూత్రాల మేరకే ఎన్నికవుతారని.. పవిత్ర రాజ్యాంగం మీదనే పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. అంతటి మహనీయుని విమర్శించడం అంటే భారతదేశాన్ని, భారత జాతిని విమర్శించడమేనని చెప్పారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఈ అంశాన్ని తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కులగణన ద్వారా ఎస్సీలకు తీవ్రమైన అన్యాయం జరిగే ప్రమాదం ఉందని చెప్పారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-ఈపూరు

చదువుతోనే మంచి భవిష్యత్తు లభిస్తుందని గంగినేని ఫౌండేషన్ చైర్మన్ గంగినేని రాఘవరావు అన్నారు. మండలంలోని బొగ్గరం జడ్పిహెచ్‌ఎస్, ఈపూరు ఏపీ మోడల్ స్కూల్‌ల్లోని 10వ తరగతి విద్యార్థులు 95 మందికి స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించారని, దీనిని సక్రమంగా వినియోగించుకున్న విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ సమయాన్ని వృథా చేయకూడదని.. టీవీలు, సినిమాలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వీరప్పయ్య, సునీల్, మోడల్ స్కూల్ ఎస్‌ఎంసి చైర్మన్ బి.ఆంజనేయులు, టిడిపి సీనియర్ నాయకులు అయినాల కోటేశ్వరరావు, రాపర్ల మురళి, ఆంజనేయరాజు, వెంకటరావు, పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఈతకెళ్లి మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులనుఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పరామర్శించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించి, మృతి చెందిన పొదిలి చరణ్, నల్లూరి గోపీచంద్ తల్లిదండ్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వారిని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, ఆర్డీఓ రమణకాంత్ రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

కృష్ణవేణి కళాశాలలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం, ఎంబీఏ విద్యార్థులకు ఎంటర్‌పెన్యూర్‌షిప్ - స్టార్టప్‌లపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీలోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ చీఫ్ మేనేజర్, డాక్టర్ చక్రవరం వెంకటరాజు పాల్గొని, పలు అంశాలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పొన్నూరులో న్యాయవాదిని నిర్బంధించి కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని స్థానిక న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నాలుగు కోర్టుల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద ముక్తకంఠంతో నినాదాలు చేశారు. పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది భేతాళ ప్రకాశరావును అక్కడి పోలీసులు నిర్బంధించి వాతలు తేలేలా పోలీసులు కొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

పాటిబండ్ల తిరుణాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల తిరునాళ్లు సోమవారం జరిగాయి. ఈ తిరుణాల్లో పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

'ఫీజుల కోసం ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడి'

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చెందిన ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు విద్యాహక్కు చట్టన్ని అమలు చేయడం లేదని పలువురు బీసీ సంఘ నాయకులు తెలిపారు. బీసీ విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారని.. చట్టం ప్రకారం వారికి ఉచితంగా విద్యను అందించాల్సి ఉన్నప్పటికీ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయని చెప్పారు. పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా తగు న్యాయం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హరేకష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

మోకాళ్లపై క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-మంగళగిరి

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, వీవీ జవహర్‌లాల్, బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి హెచ్చరించారు. చోదకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెండు నెలలుగా వేతనాలు అందక క్లాప్ ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం అమలు చేయాలని, నెలకు వేతనం రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, యూనియన్ అధ్యక్షులు డి.శివ, కార్యదర్శి ఎ.రవి, యూనియన్ నాయకులు ఆర్.కృష్ణ, వై.శివ, పి.శ్రీనివాసరావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి లోకేశ్ స్పందించాలి'

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఏసీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఏసీసీ కార్మికుల రిలే దీక్షా శిబిరాన్ని సోమవారం వారు సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కంపెనీ లాకౌట్ అనంతరం ఇప్పటికే 170 మందికి పైగా కార్మికులు అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో చనిపోయినా పాలక పక్షాలకు చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. దీక్షల్లో వేము రిబ్కా, తుపాకుల కౌసల్య, ఉదయగిరి రమణ, వేముల లక్ష్మి, దర్శి మల్లేశ్వరి తదితరులు కూర్చొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ రహిత నగరం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పేపర్లు, సింగిల్ యూజ్ బాటిళ్లను విక్రయించడం, వినియోగించడం నిషేధమని నగర కమిషనర్ అలీం బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మార్కెట్‌కు వచ్చేటప్పుడు ఇంటి నుంచి వస్త్రం, పేపర్, లేదా జూట్‌తో చేసిన సంచులను మాత్రమే వెంట తెచ్చుకోవాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దుకాణాల యజమానులు ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేయరాదని సూచించారు. తమ దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న డస్ట్‌బిన్‌లో మాత్రమే పారబోయాలని, ప్రతి రోజూ పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలని తెలిపారు.

'ఖాతాదారులకు మెరుగైన సేవలు'

ప్రజాశక్తి-మంగళగిరి

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ముందుంటోందని ఆ బ్యాంక్ ఛైర్మన్ కె.రాంబాబు తెలిపారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ కల్పిస్తున్నట్లు చెప్పారు. సోమవారం మంగళగిరి బ్రాంచ్ కార్యాలయంలో ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా కస్టమర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు, బ్రాంచ్ మేనేజర్ జి.మమత మాట్లాడారు. ఖాతాదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను, సంస్థ ప్రగతిని వివరించారు. సమావేశంలో సీఈవో శ్యామ్ కిషోర్, రీజినల్ మేనేజర్ జె.మురళి తదితరులు పాల్గొన్నారు.

మినీ రైతు బజార్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మున్సిపల్ పరిధిలో నూతన రైతు బజార్ నిర్మాణానికి పురపాలక సంఘ చైర్పర్సన్ రాధిక సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం పక్కన ఉన్న మున్సిపల్ స్థలంలో రూ 15 లక్షల మున్సిపల్ నిధులతో ఎనిమిది దుకాణాలను నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పురపాలక సంఘ పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక 15వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించిన ఆమె పలు సూచనలు చేశారు. వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ విద్యార్థికి ఐఐటీ సీటు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పదవ తరగతి చదివిన విద్యార్థిని కామినేని గుణశ్రీ ప్రతిష్టాత్మకమైన చెన్నై ఐఐటీలో సీటు పొందింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళికాంత్ విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా మురళి కాంత్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక స్థితికి, అవగాహన శక్తికి అనుగుణంగా నెహ్రూ నికేతన్ లో విద్యాబోధన జరుగుతోందన్నారు.

వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్

పీజీఆర్ఎస్‌లో ఎనిమిది వినతులు

ప్రజాశక్తి-తెనాలి రూరల్

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అర్జీదారుల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. రెవెన్యూ(సర్వే) 3, మున్సిపాలిటీ 1, పోలీసు శాఖ 1, అగ్రికల్చర్ 1, తాగునీరు 1, పంచాయతీ రాజ్ -1 చొప్పున వినతులు అందాయి. నిర్దేశిత సమయంలో పిజిఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు.

తెనాలి తహసీల్దారు కార్యాలయంలో వినతుల స్వీకరణ

తెనాలిరూరల్: తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు స్వీకరించినట్లు శిక్షణ సహాయ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

13న మట్టి మనిషి నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి

తెలుగు సాహిత్యంలో గొప్ప రచన మట్టి మనిషి నాటకమని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీనగర్ సిపిఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ తెనాలి ప్రాంత రచయిత డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి 1970లో మట్టి మనిషి నాటకాన్ని రచించారని తెలిపారు. ఈ నెల 13న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి సింగారావు, ఉపాధ్యక్షులు కనపర్తి బెన్హర్, పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

'చుండూరు బాధిత రైతులకు అండగా ఎమ్మార్పీఎస్'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

చుండూరు బాధితులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నూతలపాటి అశోక్ బాబు ప్రమేయాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ తీవ్రంగా ఖండించారు. చుండూరు మారణకాండలో అసువులుబాసిన మాల, మాదిగ కుటుంబాలకు కేటాయించిన 16 ఎకరాల ప్రభుత్వ భూమి తనదేనంటూ అశోక్ విక్రయాలకు సిద్ధమవడం అన్యాయమని అన్నారు. అశోక్ బాబు మాటలు విని రైతులు మోసపోవద్దని సూచించారు.

యూజీడీ కార్మికులకు పీపీఈ కిట్లు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారోగ్యం కాపాడే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు కూడా శ్రద్ధ చూపాలని, విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే)లోభాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యూజిడి) కార్మికులకు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్ (పిపిఈ) కిట్లను కమిషనర్ అందించారు. జిఎంసి పరిధిలో యూజిడి కార్మికులు 121 మంది ఉండగా, వారిలో తొలుత 50 మందికి పిపిఈ కిట్లు అందించామని, ఇప్పుడు మరో 70 మందికి ఇస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి ఉండవల్లిలో టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సంక్రాంతి పండగ నేపథ్యంలో తాడేపల్లి సూపర్ లీగ్ పేరుతో ఉండవల్లి దేవుడి మాన్యం గ్రౌండ్ వేదికగా క్రీడా సంబరం మంగళవారం నుంచి జరగనుంది. నులకపేటలోని తాడేపల్లి ప్రెస్ క్లబ్ లో లీగ్ కు సంబంధించిన బ్రోచర్‌ను జనసేన పార్టీ సీనియర్ నాయకులు జొన్న రాజేష్, టీడీపీ నాయకులు గాదె వినయ్ ఆవిష్కరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

రెడ్డిపాలెం-ఇన్నర్ రింగ్‌రోడ్ విస్తరణ పనులు వేగంగా చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.

శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అన్న ప్రసాత వితరణ చేపట్టారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలా అమావాస్య తర్వాత వచ్చే సోమవారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కటారి విష్ణుమూర్తి, జూట్రు ఏడుకొండలు, గండికోట రాజారావు, కోదాడ శ్రీనివాసరావు, పి.సుబ్రహ్మణ్యం, పంచల శివ, పూర్ణ, రెడ్డి వీర రాఘవులు, పంచల శివన్నారాయణ, నంద్యాల గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట పంపు హౌస్ కాలనీలో పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జీవో 77తో పీజీ విద్యార్థులకు అన్యాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబరు 77ను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థి హక్కుల సాధనకు రాష్ట్రవ్యాప్త ధర్నాకు సిద్ధంగా ఉన్నామన్నారు. సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ వి.సంజనాసింహాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్ పీజీ విద్యార్థులకు రావాల్సిన రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొలుత శివాజీ చౌక్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ విద్యార్థి సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యశ్వంత్, తెనాలి నియోజకవర్గం కార్యదర్శి చెన్నూరు సాయి, సహాయ కార్యదర్శి జె.తేజ, ఉపాధ్యక్షులు భూమేష్, కోశాధికారి దినేష్, శశి, కోటి, పవన్ కుమార్, తేజి ఉమేష్ పాల్గొన్నారు.

గీతాంజలి హైస్కూల్లో చంద్రయాన్ సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఎటి అగ్రహారం, రామిరెడ్డి నగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో సోమవారం చంద్రయాన్-3 సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం షేక్ షంషాద్ భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10వ తేదీ వరకూ న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసుల దాడికి నిరసనగా మంగళవారం నుండి 10వ తేదీ వరకూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్స్ ఫెడరేషన్ ప్రకటించింది. ఈ అంశంపై గుంటూరు బార్ అసోసియేషన్ ఇప్పటికే విధులు బహిష్కరించిన విషయం తెలిసిందే. గుంటూరు జిల్లా బార్ అసోసియేన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు బార్ అసోసియేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని వివిధ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు హాజరయ్యారు. 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు విధులకు హాజరుకారాదని సమావేశంలో తీర్మానించారు.

క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు, విజ్ఞాన్ వైస్ ఛైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు

క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. స్థానిక పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండ్రోజులపాటు నిర్వహించే 'విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు-2025' సోమవారం ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు సోమవారం కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడాంశాలతో పాటు నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త క్రీడాపాలసీని తీసుకొచ్చిందని తెలియజేసారు. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ఒలింపిక్స్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు నగదు ప్రోత్సాహకంతో పాటు గ్రూప్-1 ఉద్యోగాన్ని తమ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆసియా క్రీడలు, ఖేలో ఇండియా తదితర క్రీడల్లో సత్తాచాటిన వారికి అందుకు అనుగుణంగా పారితోషికాలు అందిస్తుందని వెల్లడించారు. క్రీడాకారులకు చేయూతనందిచాలనే ఉద్దేశంతో ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు, స్పోర్ట్స్ మెటీరియల్ అందుబాటులోకి తేవడం, ఇన్సెంటివ్స్ అందించడం, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు తగిన శిక్షణ అందించాలనే అంశాలను స్పోర్ట్స్ పాలసీలో చేర్చినట్లు వివరించారు. అలాగే ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ శాతాన్ని తమ ప్రభుత్వం పెంచిందని, క్రీడల్లో సత్తాచాటిన వారికి డైరెక్ట్ యూనిఫామ్ జాబ్స్ అందించేలా చర్యలు తీసుకుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలో ఒకే చోట అన్ని క్రీడలను ఆడే విధంగా జాతీయ స్థాయి ప్రామాణాలతో కూడిన అమరావతి స్పోర్ట్స్ క్యాపిటల్‌ను తీసుకురావాలనే కత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. ప్రతి స్కూల్‌కి కూడా గ్రౌండ్ ఉండాలని జీవో జారీ చేయడం జరిగిందని తెలిపారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటుగా క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ.అనురాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజేతలను అభినందించిన కళాశాల పాలక వర్గం సభ్యులు

47వ ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల (పురుషుల) అథ్లెటిక్స్ చాంపియన్షిప్ - 2024లో స్థానిక ఎస్ ఎస్ ఎన్ కళాశాల విద్యార్థులు బంగారు పతకాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.ఎస్ సుధీర్ సోమవారం తెలిపారు. డిసెంబర్ 13 నుండి 15 వరకు డిపార్టు మెంట్ ఆఫ్ - ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఏ.ఎన్.యు క్యాంపస్‌లో అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తమ కళాశాలకు చెందిన సిహెచ్ వి ఎం. గురు శంకర్ 200, 400 మీటర్ల పరుగు పందెంలో రెండు బంగారు పతకాలను సాధించాడన్నారు. సిహెచ్ విఎం. గురు శంకర్, ఎస్.లాజర్, ఎం.దుర్గా సాయి, వై.చరణ్ కుమార్ లు 400 మీటర్ల రిలే పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. 2 బంగారు, 6 కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, కార్యదర్శి అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, వైస్-ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరి పూటుకూరి వెంకట అప్పారావు, పాలక వర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పానుగంటి శ్రీనివాససాయి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూధనరావు తదితరులు అభినందించారు.

తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి..

కలెక్టర్ గ్రీవెన్స్‌లో 183 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, అధికారులు

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లతోపాటు రెవెన్యూ సదస్సులలో అందిన పిటీషన్లు కూడా నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్‌తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు ప్రజల నుండి 183 అర్జీలు స్వీకరించారు. సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ పెండింగ్ పిటిషన్లపై సమీక్షించి సూచనలు చేశారు. ఈసమావేశంలో సిపిఓ శేషశ్రీ, పంచాయితీరాజ్ ఎస్.ఇ బ్రహ్మయ్య, డియంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ , డిఎస్ఓ కోమలి పద్మ, డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్ , డిసిఓ వీరాచారి తదితరులు పాల్గొని అర్జీలు స్వీకరించారు.

అర్ధనగ్నంగా బైఠాయించి వృద్ధుడు నిరసన...

రెండు సంవత్సరాలుగా తన సమస్యను పరిష్కరించట్లేదని గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతున్న చోట తెనాలికి చెందిన కేసన పిచ్చయ్య చొక్కా విప్పి, బైఠాయించి నిరసన తెలిపారు. తన మొర ఆలకించాలని ఆవేదన చెందాడు. స్పందించిన పోలీసులు వెంటనే ఆయనను వారించి, కలెక్టర్‌తో మాట్లాడించారు. వారం రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వటంతో వృద్ధుడు ఆందోళన విరమించాడు. తెనాలి మండలం, సోమసుందరపాలెంకు చెందిన కేసన పిచ్చయ్య వృద్ధాప్యంలో ఉన్నానని, తన ఆస్తిని మేనకోడలుకు రిజిస్ట్రేషన్ చేశానని, ఆస్థి ఇచ్చిన తర్వాత తనను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరుతూ గత రెండు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని చెప్పాడు. మూడు నెలల్లో పరిష్కరించదగిన తన సమస్యను సంవత్సరాల తరబడి సాగదీస్తున్నారని అన్నారు. సమస్యపై స్పందించిన కలెక్టర్ వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. దీంతో వృద్ధుడు ఆందోళన విరమించాడు.

చేబ్రోలులో పంచాయతీ కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలి..

చేబ్రోలు గ్రామపంచాయితీలో తొలగించిన పంచాయతీ కార్మికుల్ని తిరిగి విధుల్లో తీసుకోవాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. గత 15 సంవత్సరాలుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులుగా ఎటువంటి రిమార్క్స్ లేకుండా పనిచేస్తున్న 12 మంది కార్మికుల్ని ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఈనెల 1వ తేదీ నుండి తొలగించారని తెలిపారు. వీరిని ఆపటానికి గల కారణాలు కూడా మేస్త్రీ చెప్పట్లేదన్నారు. పంచాయతీ నుండి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. అక్రమ తొలగింపులు ఉపసంహరించుకొని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు చింతల శ్రీను, కార్మికులు ఎన్.రాఘవమ్మ, పి.సుజాత, కె.దివ్యశ్రీ తదితరులున్నారు.

జిఎంసి వరద సహాయ నిధులపై విచారణ చేయాలని వినతి

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

విజయవాడ వరదల సమయంలో బాధితుల సహాయార్థం, గుంటూరు నగరపాలక సంస్థ విడుదల చేసిన రూ.9 కోట్ల 22 లక్షల 97వేల 159లు నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు అర్జీ అందచేశారు. కార్పొరేటర్లకు, మేయర్, డిప్యూటీ మేయర్లకు, స్థానిక ఎంపికి, ఎమ్మెల్యేలకు తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు మళ్లించారన్నారు. ప్రజా ప్రతినిధిగా వరద బాధితులకు ఆసరాగా నిలవటం సాదరంగా స్వాగతిస్తామని, కానీ నిధుల కేటాయింపులో ఆద్యంతం జిఎంసి కమిషనర్ వ్యవహరించిన తీరు అనుమానాలకు తావిస్తుందన్నారు. కావున సమగ్ర విచారణ చేయాలని కోరారు. అలాగే ఇటీవల జిఎంసి కౌన్సిల్ సమావేశంలో ఒక ప్రశ్నకు సమాధానం సంతృప్తికరంగా లేకపోవటంతో ఈ సమాధానం రాసిన అధికారి ఎవరు అని తాను ప్రశ్నించినా ఎవరూ స్పందించకుండా ప్రజా ప్రతినిధుల్ని అవమానించారన్నారు. దీంతో తాను ప్రజా ప్రతినిధులు పిచ్చివాళ్లా..? ఏం తమాషా చేస్తున్నారా అని అభ్యంతరం వ్యక్తం చేశానన్నారు. దీంతో కమిషనర్ పైకి లేచి అరవటం ప్రారంభించి, మైకు విసిరి, చితిలోని పేపర్లను చించివేసి, కోపంతో ఊగిపోతూ ప్రజా ప్రతినిధులవైపు కోపంగా చూస్తూ బయటకు వెళ్లిపోయారన్నారు. జరిగిన విషయంపై చర్చలు జరిపి విలువలు కాపాడాల్సిన కమిషనర్ వాస్తవాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, తన వద్ద పనిచేస్తున్న సిబ్బందితో ఆందోళనలకు ప్రోత్సహించటం అభ్యంతరకరం అన్నారు. అదే విధంగా మాకు గతంలో కేటాయించిన వ్యక్తిగత సిబ్బందిని కూడా వెనకకు పిలిపించారన్నారు. జరిగిన పరిణామాలలో ఐఏఎస్ సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా కమిషనర్ వ్యవహరించారన్నారు. కావున మొత్తం ఘటనపై సమగ్ర విచారణ చేయాలని కోరారు.

జిఎంసి గ్రీవెన్స్‌కు 40 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

గుంటూరు నగరంలో ప్రజలు గ్రీవెన్స్‌లో అందిస్తున్న అర్జీలు సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారుల్ని ఆదేశించారు. సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డయల్ యువర్ కమిషనర్‌లో 24 అర్జీలు, గ్రీవెన్సకు 40 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కమి షనర్ సిహెచ్. ఓబులేసు, డిప్యూటీ కమిష నర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్ .శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటిప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామి రెడ్డి పాల్గొన్నారు.

జిఎంసి ఉద్యోగులకు రక్షణ కల్పించాలి..

జిఎంసి అధికారుల్ని అనుచిత పదజాలంతో దూషించటాన్ని నిరశిస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు విధేయులుగా పనిచేశామని, కానీ ప్రస్తుత కౌన్సిల్ పనితీరు ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో అధికారుల్ని డిప్యూటీ మేయర్ దూషించా రన్నారు. డిప్యూటీ మేయర్ ఉద్యోగులను ఒంటరిగా పిలిచి, ఆయా విభాగాల సమాచారం తనకు అందచేయాలని, లేనిచో తనదైన శైలిలో ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తురన్నారు. కావున తమకు రక్షణ కల్పించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో నమ్రత్‌కుమార్, కె.మధుబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.